


## నెలనెలా నవ్వుల పండగ

## మల్లాది వెంకటకృష్ణమూర్తి స్పెషల్



**గుర్రపుస్వారీ** పిచ్చి ఉన్న ఒకతను ఓ రోజు తన గుర్రానికి అజీర్తి చేయడంతో వెటర్నరీ డాక్టర్ దగ్గరికి దగ్గరకి వెళ్ళాడు. అయితే ఆయన అర్జెంటుగా ఊరెళ్తున్నాడు. అందుచేత డాక్టర్ అతనికి ఒక మాత్ర, ఒక గొట్టం ఇచ్చి చెప్పాడు.

"ఈ మాత్రని గొట్టం చివరలో ఉంచి ఆ భాగాన్ని గుర్రం నోట్లో ఉంచండి. ఇవతలి చివరినుంచి గట్టిగా ఊదితే ఆ మాత్ర వెళ్ళి గుర్రం కడుపులో పడుతుంది. నేను ఊరినుంచి వచ్చాక కలుస్తాను."

డాక్టర్ ఊరినుంచి తిరిగొచ్చాక వాళ్ళ ఇంటికి వెళ్ళాడు. ఆయన మంచం మీద నాలుగు లంఖణాలతో చిక్కి శల్యమై కనిపించాడు.

"మీ గుర్రం ఎలా ఉంది? నేను చెప్పినట్లు చేశారా?" అడిగాడు వెటర్నరీ డాక్టర్.

"అయ్యా... మీరు చెప్పినట్లే చేశాను. కాని నాకన్నా ముందు గుర్రం గట్టిగా ఊదింది" చెప్పాడాయన.

★★★

## చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

"మీరు గతవారం వచ్చుంటే ఓ మంచి ఇల్లు అద్దెకిప్పించేవాణ్ణి" నిట్టూరుస్తూ అన్నాడు జగన్నాధం.

"అరె! ఇప్పుడా ఇంట్లో మరొకళ్ళు దిగారా?" అన్నాడు సోమనాధం.

"లేదుగానీ మొన్నటి వర్షాలకి పడిపోయింది."

❦❦❦

"ఇదివరలో నా బొమ్మ ఎంతో అందంగా వేశావు. ఇప్పుడిలా ఏడ్చిందేం?" విసుగ్గా అడిగిందో ధనవంతురాలు.

"అప్పట్లో నేనిప్పటికన్నా పది సంవత్సరాలు చిన్నవాణ్ణి గదండీ"

❦❦❦

"సార్! డాక్టర్ని కలవాలి" కంపౌండర్‌తో అన్నాడో పేషెంట్.

"మరోవారం తర్వాత కనిపించండి" అన్నాడు కంపౌండర్.

"కానీ అప్పటికి నా రోగం ముదిరి ప్రాణాలు పోతేనో"

"ఎందుకంత భయపడతారు? అప్పుడు మీ నుంచి ఫీజు వసూలు చేయంలెండి"

❦❦❦

"ఏమయ్యా! మరీ రాచుకుని పోకపోతే, కొంచెం పక్కనుంచి పోలేవూ?" రుసరుసలాడుతూ అంది సూర్యకాంతం.

"పోవచ్చుననుకోండి. పెట్రోలు ధర బాగా పెరిగిపోయింది. మీ చుట్టూ రౌండ్ కొట్టి పోవడానికి చాలా పెట్రోలు ఖర్చయిపోతుంది" సూర్యకాంతం భారీ శరీరం వంక గుడ్లప్పగించి చూస్తూ చెప్పాడా మోటారిస్టు.

❦❦❦

"నేను ఛస్తే మళ్ళీ మీ గడపతొక్కను. మా పుట్టింటికెళ్ళిపోతాను" అంది భార్య.

"ఇదిగో ఛార్జీ డబ్బులు. ఇప్పుడే వెళ్ళిపో" అన్నాడు వెంటనే భర్త డబ్బందిస్తూ.

డబ్బు లెక్కించుకుని "నాపీడ శాశ్వతంగా వదిలించుకుని ఎవత్తెతోనో తైతక్కలాడాలని చూస్తున్నారు కదూ! అందుకే తిరిగి రావడానికి చార్జీలివ్వలేదు" మరింత కోపంగా అందా భార్యామణి.

"మీరు అత్యుత్తమంగా ఏ సీన్‌లో నటించారు?" అడిగాడో తారను విలేఖరి.

"గత సంవత్సరం ఆదాయపు పన్ను అధికారులు మా ఇంటిమీద దాడి జరిపినప్పుడు.."

"మొదటి సీన్‌లోనే నా మరణాన్ని చూపించడం ఏం బావోలేదు" కోపంగా అన్నాడో వర్ధమాన నాటక కళాకారుడు.

"నువ్వు చివరివరకూ వుంటే ప్రజల చేతుల్లో హత్యగావింపబడతావేమోనని కంట్రాక్టరుగారు అలా ఏర్పాటు చేశారు" అసలు విషయం చల్లగా చెప్పాడు డైరెక్టరు.

"వక్తృత్వపు పోటీలో ప్రథమ బహుమతి పొందావుగదా! ఇంటికి వెళ్ళగానే మీ నాన్నగారు ఏమని అభినందిస్తారు?" అడిగింది సుశీలను స్నేహితురాలు.

"నువ్వుకూడా మీ అమ్మలా తయారవుతున్నావేమిటి అంటారేమో"

"మీ సర్వర్ ఓ కుంటి కోడిని సర్వ్ చేశాడు" హోటల్ మేనేజరుతో ఫిర్యాదు చేశాడు సుందర్రావు.

"మీకు చికెన్ తింటానికే కాని డాన్స్ చేయడానికి కాదుగదండీ" సర్ది చెబుతూ అన్నాడు మేనేజర్.

❦❦❦

"నిన్న సిరా మరకలు చెరిపే లోషన్ తీసుకున్నానుగదా మీ దగ్గర"

"అవును. గుర్తుంది. ఆ లోషన్ మరో బాటిల్ కావాలా ఏమిటిసార్..?"

"అక్కర్లేదుగానీ ఆ లోషన్ చేసిన మరకలు చెరపడానికి మరో లోషన్ ఏదయినా ఉందా?"

❦❦❦

COMMENTS